క్లుప్తంగా

పరామర్శ



నర్సంపేట : స్థానిక మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సోమవారం పరామర్శించారు. శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నర్సంపేట రూరల్ : పట్టణంలోని శాంతినగర్‌లోని అబ్దుల్ సత్తార్ నివాసంలో పేకాడుతుండగా పోలీసులు ఆరుగురిని అరెస్ట్ చేశారు. టౌన్ సీఐ రమణమూర్తి మీడియాకు వివరాలు వెల్లడించారు. పేకాడుతున్నారన్న సమాచారం అందడంతో దాడులు నిర్వహించి రూ.24,400 నగదుతోపాటు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. అరెస్ట్ అయిన వారిలో అంకాల మల్లికార్జున్, హరిదాస్ కృష్ణ, ఎర్రబోయిన కిషన్, కొమ్ముల నవీన్, అబ్దుల్ సత్తార్, చుక్క అనిల్ ఉన్నట్లు సీఐ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ఖానాపురం : షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని ధర్మరావుపేటలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాజబోయిన పొడయ్య ఇంట్లో పలుమార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అనంతరం ఒకేసారి విద్యుత్ సరఫరా ఎక్కువగా అయ్యి షార్ట్‌సర్క్యూట్ చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఫ్యాన్, టీవీ, ఫ్రిజ్, 14 బస్తాల బియ్యం, రూ.45 వేల నగదు, దుస్తులతోపాటు ఇల్లు దగ్ధమైంది. ఘటనా స్థలాన్ని విద్యుత్ అధికారులు పరిశీలించారు.

వర్షానికి కూలిన..



ఖానాపురం : ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని బుధరావుపేటలో బత్తిని శ్రీనుకు చెందిన ఇల్లు కూలిపోయింది. శ్రీను కుటుంబ సభ్యులతో ఇంట్లోనే ఉండగా స్వల్ప గాయాలయ్యాయి. ఇంటి పెంకులు, ఇంట్లోని సామగ్రి పూర్తిగా ధ్వంసం అయ్యాయి.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి



చెన్నారావుపేట : విద్యుదాఘాతానికి గురై దుక్కిటెద్దు మృతి చెందిన ఘటన మండలంలోని గొల్లపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బానోతు రమేశ్ సాకుతున్న దుక్కిటెద్దు గ్రామ శివారులో మేత మేస్తూ కిందికి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. దుక్కిటెద్దు విలువ సుమారు లక్ష రూపాయల విలువ ఉంటుందని రైతు వాపోయాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తులో ఏర్పాటు చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఖానాపురం : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని బుధరావుపేటలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం .. ధర్మరావుపేటకు చెందిన మల్లమ్మ రోడ్డు దాటుతుండగా ఆమెతోపాటు రోడ్డు పక్కనున్న జుబేర్‌ను మహబూబాబాద్ వైపు నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఇద్దరికీ గాయాలవడంతో స్థానికులు చికిత్స నిమిత్తం నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గీతకార్మికుడికి..

ఖానాపురం : తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలైన ఘటన మండలంలోని మంగళవారిపేటలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తాళ్లపెల్లి పెద్ద కమలాకర్ గ్రామ శివారులోని తాటిచెట్టు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. స్థానికులు ఆయనను నర్సంపేట ఆస్పత్రికి తరలించారు.

నేడు ప్రజావేదిక

ఖానాపురం : మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నేడు (మంగళవారం) సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ భారతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో మార్చి 2023 నుంచి ఏప్రిల్ 2024 వరకు జరిగిన పనులపై సమీక్షించనున్నట్టు పేర్కొన్నారు.

పాఠశాల సమీపంలోనే బావి

ప్రహరీ లేక విద్యార్థులకు పొంచి ఉన్న ప్రమాదం

- భయాందోళనలో ఉపాధ్యాయులు
- పట్టించుకోని అధికారులు



పాఠశాల సమీపంలో ప్రమాదకరంగా ఉన్న బావి

ఖానాపురం : మండలంలోని ధర్మారావుపేట శివారులోని బాల్‌తండా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమీపంలోనే వ్యవసాయ బావి ఉంది. పాఠశాలకు ఆ వైపు ప్రహరీ నిర్మించకపోవడంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. ఈ క్రమంలో ఉపాధ్యాయులు భయాందోళన నడుమ విధులు నిర్వహిస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఉపాధ్యాయులను, విద్యార్థుల తల్లిదండ్రులను భయాందోళనకు గురి చేస్తున్న క్రమంలో 'సాక్షి' కథనం..

బాల్‌తండా ప్రాథమిక పాఠశాలలో 21 మంది విద్యార్థులు చదువుతుండగా ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. పాఠశాలకు ఒకవైపు మాత్రమే ప్రహరీ ఉంది. పాఠశాలకు మరో వైపు వ్యవసాయ భూములు, బావులున్నాయి. గతంలో అధికారులకు పాఠశాలకు కేవలం ఒకవైపు మాత్రమే ప్రహరీ నిర్మించి మరో వైపు నిర్మించకుండా వదిలేశారు. ఈ క్రమంలో పాఠశాలకు అతి సమీపంలోనే ఉన్న వ్యవసాయ బావితో విద్యార్థులకు ముప్పు పొంచి ఉందంటూ తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. బడిబాట సమయంలోనూ పిల్లలను సదరు పాఠశాలలో చేర్చేందుకు పలువురు తల్లిదండ్రులు ససేమిరా అన్నారు. ఎల్లవేళలా పర్యవేక్షిస్తామని ఉపాధ్యాయులు నచ్చజెప్పినా విద్యార్థులు తల్లిదండ్రులు పిల్లలను సదరు స్కూల్‌లో చేర్పలేదు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులు అటువైపుగా వెళ్లకుండా నిత్యం పర్యవేక్షించాల్సిన పరిస్థితి ఉండటంతో ఉపాధ్యాయులు భయాందోళన నడుమ విధులు నిర్వహిస్తున్న దుస్థితి నెలకొంది. వ్యవసాయ భూముల వైపు సుమారు 150 మీటర్ల దూరంలో పాఠశాలకు ప్రహరీ నిర్మిస్తే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవనే వాదన బలంగా వినిస్తోంది. వ్యవసాయ భూములకు సంబంధించిన రైతులకు సమస్యను వివరిస్తే తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నా ఆ దిశగా విద్యార్థులు వెళ్లడానికి అనుకూలంగానే ఉంటోంది. ఇలా ప్రతీరోజు విద్యార్థులను బావి ఉన్న వైపు వెళ్లకుండా ఉపాధ్యాయులు కాపలా కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు చుట్టూ ప్రహరీ నిర్మించి విద్యార్థుల ప్రాణాలకు ముప్పు లేకుండా చూడాలని తండావాసులు కోరతున్నారు.

పిల్లలను బడిలో చేర్చడం లేదు

విద్యార్థులను పాఠశాలలో చేర్పాలని వారి తల్లిదండ్రులను కోరితే సమీపంలోని వ్యవసాయ బావి ఉందంటూ పంపడం లేదు. ఎలాంటి ప్రమాదం జరగకుండా చూసుకుంటామని భరోసా ఇచ్చినా భయపడుతున్నారు. వ్యవసాయ భూమి యజమానితో మాట్లాడి తాత్కాలిక ఏర్పాట్లు చేయించాము. అయినా విద్యార్థులు ఆ దిశగా వెళ్లడానికి వీలుగానే ఉంది. ఆ వైపు ప్రహరీ నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుంది. విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

-రమేశ్, ప్రధానోపాధ్యాయుడు, బాల్‌తండా పీఎస్

ఇంటర్ విద్యార్థులకు బస్సు ఫ్రీ



బస్సును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ కరుణశ్రీ

నెక్కొండ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచే దిశగా ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా కళాశాలకు బస్సు సదుపాయం కల్పిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కరుణశ్రీ తెలిపారు. బస్సును సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. స్థానికంగా ఉన్న హాస్టళ్ల (బాలబాలికల పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్ల)లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులు కళాశాలకు వెళ్లి రావడంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం సౌజన్యంతో బస్సు సదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థుల సౌలభ్యం కోసం ఈ కార్యక్రమం చేపట్టామని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు ఈ ఉచిత బస్ సౌకర్యంను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎస్సై మహేందర్, మోడల్ స్కూల్/కళాశాల ప్రిన్సిపాల్ ప్రణయ్‌కుమార్, హాస్టల్ వార్డెన్ హాల్‌సింగ్, నెక్కొండ జీపీ కార్యదర్శి సదానందం, అధ్యాపక బృందం రమణాకర్, ప్రభాకర్, సంపత్, రంజిత్‌కుమార్, ఆనందం, కీర్తి, భీమేందర్, శ్రీలత, బిక్షపతి, లక్ష్మణ్, రాజు, లైబ్రరియన్ బాబు పాల్గొన్నారు.

బీసీ ప్రజా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సురేశ్



సంగెం: తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సంగెం మండలం కొత్తగూడెం గ్రామ మాజీ సర్పంచ్ వాసం సురేష్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం వరంగల్ ఓ సిటీలో జరిగిన తెలంగాణ బీసీ ప్రజా సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో నియామక పత్రం అందజేశారు. బీసీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా యూత్ అధ్యక్షుడు అవునూరి సతీష్, నూనె రవి, సాగరిక, రజిత, శృతి పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



గీసుకొండ : సామాజిక సేవకుడు వల్లెం శ్రీనివాస్ తన సొంత డబ్బుతో సమకూర్చిన నోట్‌బుక్స్‌ను గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్‌కు చెందిన ధర్మారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తహసీల్దార్ రియాజుద్దీన్, కార్పొరేటర్ మనీషా శివకుమార్ సోమవారం పంపిణీ చేశారు. అనంతరం శ్రీనివాస్‌ను తహసీల్దార్, కార్పొరేటర్ అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేఖ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు మంజుల, జ్యోతి, లక్ష్మి, కన్నోజు మదన్, తదితరులు పాల్గొన్నారు.

హరితహారం సామాజిక బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ, తదితరులు

చెన్నారావుపేట : హరితహారం కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా ఎంపీడీఓ శ్రీధర్‌రాజు, ఏపీఎం ఈశ్వర్, ఏపీఓ అరుణ అభివర్ణించారు. మండల కేంద్రంలోని ఆశాజ్యోతి మండల సమాఖ్య కార్యాలయ ఆవరణలో వన మహోత్సవం సందర్భంగా సోమవారం మహిళలు, సిబ్బందితో కలిసి వారు మొక్కలు నాటి మాట్లాడారు. అన్ని గ్రామాల్లో నర్సరీలో ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతీఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ప్రతి ఇంటికీ పూలు, పండ్లు, నీడనిచ్చే 6 మొక్కలను పంపిణీ చేయడానికి ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో 6 వేల మొక్కలు నాటాల్సి ఉందన్నారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌తోపాటు పంట పొలాల్లో, తోటల పెంపకం కోసం సంప్రదించాలని సూచించారు. చిన్న, సన్నకారు రైతులకు లబ్ధి చేకూరేలా వన మహోత్సవ కార్యాచరణ ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు హైమ, కార్యదర్శి శ్రీలక్ష్మి, సీసీలు సుజాత, మంజుల, కట్టయ్య, ఎంఎస్ రజిత, ఉమ, వీఓఏలు హైమ, మహేందర్, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

అంగడి వేలం వాయిదా

నెక్కొండ : నెక్కొండ గ్రామ పంచాయతీ పరిధిలోని అంగడి (వారాంతపు సంత) వేలాన్ని ఈఓ సదానందం వాయిదా వేశారు. గ్రామ కార్యాయలంలో మేకలు, గొర్రెలు, తైబజార్‌లకు ఎంపీఓ సునీల్‌రాజ్ అధ్యక్షుతన సోమవారం వేలం చేపట్టారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడారు. ఈ ఏడాది జూన్ 2 నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు అంగడి వేలం పాటలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తైబజారు వేలాన్ని రావుల హరీశ్‌రెడ్డి రూ.1.30 లక్షలకు దక్కించుకున్నారు. మేకల–గొర్రెలకు రూ.10.50 లక్షలకు గుత్తేదారులు పాట పాడారు. ప్రభుత్వం నిర్ణయించిన అప్‌సెట్ ప్రైజ్ రాకపోవడంతో ప్రభుత్వ నిబంధనల మేరకు వాయిదా వేస్తున్నట్టు ఈఓ ప్రకటించారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపించి తదుపరి చర్యలు తీసుకోనున్నట్టు ఈఓ చెప్పారు.

రేపు సర్వసభ్య సమావేశం

పర్వతగిరి : రేపు (బుధవారం) ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ శంకర్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే నాగరాజు హాజరవుతారని పేర్కొన్నారు. అధికారులు నివేదికలతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

40 రోజులు.. వెయ్యి కి.మీ..

గీసుకొండ : ధర్మారం గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ జి.జయరాజు 40 రోజుల్లో వెయ్యి కిలోమీటర్లు సైకిల్ తొక్కి మెడల్, ప్రశంసాపత్రం అందుకున్నాడు. జయరాజు మడికొండ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. గత వేసవి కాలంలో కేరళకు చెందిన కన్నూర్ సైకిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో ఆయన పాల్గొని టాస్క్ సకాలంలో పూర్తి చేశాడు. దీంతో అసోసియేషన్ ప్రతినిధులు జయరాజుకు మెడల్, ప్రశంసాపత్రం అందజేశారు. మడికొండ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, ఎస్సై దివ్య జయరాజును అభినందించారు.

'సీఈఓపై చర్యలు తీసుకోండి'

చెన్నారావుపేట : సహ చట్టం కింద సరైన వివరాలు ఇవ్వని నేపథ్యంలో పీఏసీఎస్ సీఈఓపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీపీ జక్క అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో విలేకరులతో ఆయన సోమవారం మాట్లాడారు. సొసైటీ నుంచి గతంలో లోన్ తీసుకున్న వారి, కొత్త సభ్యుల, రుణమాఫీ, సొసైటీ ఆదాయం, చేసిన అభివృద్ధి, కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చిన ఆదాయవ్యయ, తదితర వివరాలు ఇవ్వాలని మార్చి నెలలో కలెక్టర్‌కు దరఖాస్తు చేశామని చెప్పారు. నామమాత్రంగా సమాచారం ఇవ్వడంతో మళ్లీ జూన్ 15న దరఖాస్తు చేయగా రికార్డులు వెరిఫికేషన్ చేసుకోవాలని జూన్ 27న లెటర్ వచ్చిందన్నారు. అనంతరం వివరాలు చూపించాలని సీఈఓను కోరితే సాకులు చెబుతూ దాటవేస్తున్నాడని ఆరోపించారు.

ఎస్సైపై వేధింపులు సరికాదు

నల్లబెల్లి : అశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్‌పై ఉన్నతాధికారులు, సిబ్బంది వేధింపులు సరికాదని నారక్కపేటకు చెందిన దళిత సంఘాల నాయకులు గుండాల రాజకొమురయ్య, రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

పట్టా పాస్‌బుక్కులు ఇప్పించాలి

చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామంలోని సర్వే నంబర్ 144, 74ల్లోని వ్యవసాయ భూమికి సంబంధించి తమకు పట్టాలు ఇప్పించాలని కోరుతూ కలెక్టర్‌కు రైతులు బిట్ల శ్రీనివాస్, మెండే విజేందర్, సుభాష్, స్వామి వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతులు మీడియాతో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా నాటి ప్రభుత్వం సుమారు 50 మంది రైతులకు 200 ఎకరాల భూమికి సంబంధించి పట్టాలిచ్చిందని చెప్పారు. తదనంతరం ధరణి రావడంతో తమ భూములు పహాణీలో కనబడటం లేదన్నారు.

విరాళం

పర్వతగిరి : మండలంలోని వడ్లకొండలోని రంగనాయకులస్వామి గుట్ట ఆవరణలో చేపట్టిన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం గ్రామానికి చెందిన మాచర్ల సమ్మయ్య జ్ఞాపకార్థం అతని భార్య సౌందర్య, కుమారులు అనిల్–లావణ్య, కార్తీక్–రచన దంపతులు సోమవారం రూ.25 వేల 116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ బాధ్యులు సన్మానించారు. ఆలయ నిర్మాణానికి దాతలు మరింత ముందుకు రావాలని ఆలయ కమిటీ బాధ్యులు కోరారు.

అర్హులకే 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

రాయపర్తి : మండలంలోని కాట్రపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులకే ఇవ్వాలని కోరుతూ ఆ గ్రామ ప్రజలు తహసీల్దార్ శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడారు. గత ప్రభుత్వం 40 ఇళ్ల నిర్మాణం చేపట్టగా పూర్తి కాక ముందే కొందరు ఆక్రమించుకున్నారని తెలిపారు. ఆక్రమించుకున్న వారిలో చాలా మంది అనర్హులన్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు బూడిద రవీందర్, బూడిద రఘుపతి, బూడిద పరశురాములు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలోని సమస్యలు పరిష్కరించండి



నిరసన తెలుపుతున్న ఫౌండేషన్ సభ్యులు

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామానికి చెందిన కలామ్స్ ఫౌండేషన్ సభ్యులు జిల్లా కలెక్టర్ సత్య శారదదేవికి అధ్యక్షుడు బాషమియా ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. తొలుత ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం బాషమియా మాట్లాడారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి పరికి మధుకర్, సలహాదారు ఊడుగుల రాజు, పోగుల అశోక్, కాస రాకేష్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట రూరల్ : కేక్ కట్ చేస్తున్న గోపాల్



రాయపర్తి : వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో..

ఘనంగా డాక్టర్స్ డే



దుగ్గొండి : కేక్ కట్ చేస్తున్న డాక్టర్ కిరణ్‌రాజ్



రాయపర్తి : వైద్యులను సన్మానిస్తున్న సతీశ్

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని జిల్లా ఆస్పత్రిలో డాక్టర్స్ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రిలో జిల్లా హెడ్‌క్వార్టర్స్ హాస్పిటల్స్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.గోపాల్ కేక్‌ను కట్ చేశారు. వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ వైశాలి, డాక్టర్ విక్రమ్, నర్సింగ్ సూపరింటెండెంట్ రమాదేవి, జూనియర్ అసిస్టెంట్ సురేశ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు కేక్ కట్ చేసి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే నాణ్యమైన వైద్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ నర్సింహస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి కిరణ్‌రాజ్ కేక్ కట్ చేశారు. అనంతరం వైద్య సిబ్బంది డాక్టర్ కిరణ్‌రాజ్‌ను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగులు సాంబయ్య, రమణ, రహమాన్, సబిత, రజిత పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం

రాయపర్తి : డాక్టర్స్ డే సందర్భంగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో లయన్స్ క్లబ్ ఆఫ్ వర్ధన్నపేట ఆధ్వర్యంలో వైద్యులను సోమవారం సన్మానించారు. అనంతరం గర్భిణులకు పండ్లు పంపిణీ చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా క్లబ్ వీపీ–1 అల్లాడి సతీశ్ మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి గారె నర్సయ్య, ఐపీ సెక్రెటరీ బుద్ధ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని సరిచేశారు

సాక్షి స్పందన



స్తంభాన్ని సరి చేస్తున్న అధికారులు, సిబ్బంది

నెక్కొండ : ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని అధికారులు సరిచేశారు. 'ట్రాన్స్‌కో.. జరదేఖో' శీర్షికతో 'సాక్షి'లో నేడు (సోమవారం) ప్రచురితమైన కథనానికి ఆ శాఖ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఏడీఏ ఐలయ్య సిబ్బందితో చేరుకుని నెక్కొండ పట్టణ శివారులోని పంట పొలాల్లోని వంగిన 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని సోమవారం సరిచేయించారు. అనంతరం ఐలయ్య మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభం వంగిందని చెప్పారు. ఎక్కడైన స్తంభాలు, తీగలు వంగితే అధికారులకు తెలియజేయాలని కోరారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

నర్సంపేట : పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో 1990–91 విద్యాసంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన విద్యార్థులుఉ స్థానిక పద్మశాలి సంఘం భవనంలో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సంపేటలో చదువుకుని ఎక్కడెక్కడో స్థిరపడిన సుమారు 50 మంది స్నేహితులు హాజరై సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. వనప్రేమి అవార్డు గ్రహీత గోకా రామస్వామి ముఖ్యఅతిథిగా హాజరై పూర్వ విద్యార్థులను శాంతివనానికి ఆహ్వానించారు. పూర్వవిద్యార్థులు ఆయన ఆహ్వానం మేరకు శాంతివనాన్ని సందర్శించి అక్కడ ప్రకృతిని ఆస్వాదించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రజిని, పోతుర్ల స్వరూప, ఉమ, మీనా, ఆకుల రమాదేవి, మంజుల, సునీత, భాగ్య, రేణుక, అనిత, సుజాత, శ్రీలత, గోక కవిత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మెళకువలతో మెరుగైన ఉద్యోగ అవకాశాలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న హరిహరన్

నర్సంపేట రూరల్ : శిక్షణలో నేర్చుకున్న మెళకువలతో మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి, బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజికల్ సైన్స్ (బిట్స్) ప్రిన్సిపాల్ హరిహరన్ తెలిపారు. నర్సంపేట మండలంలోని లక్నెపల్లి గ్రామ శివారులోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్సెస్ కళాశాలలో ఐక్యూఏసీ ఆధ్వర్యంలో టాస్క్ సహకారంతో 'మెడికల్ కోడింగ్ అండ్ బిల్లింగ్'పై ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని సోమవారం వారు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందడానికి శిక్షణ దోహదం చేస్తుందని తెలిపారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, రిసోర్స్‌పర్సన్ నిఖిల్ చంద్ర, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రవి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రవి, మనీష్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

రాయపర్తి (వర్ధన్నపేట) : ఈనెల 7న ఏపీలోని ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు ఈదుముడిలో తలపెట్టిన మాదిగల మహాజాతర సభకు సంబంధించిన కరపత్రాలను వర్ధన్నపేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాదిగ రాజకీయ పోరాట సమితి నియోజకవర్గ ఇన్‌చార్జి ఈరెల్లి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గద్దల కుమార్ సోమవారం ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాస్, కుమార్ మాట్లాడారు. సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎలికట్టె ప్రభాకర్, రడపాక యాకయ్య, దుబ్బ అంజయ్య, ఎలికట్టె ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.